

తాళ్లపోడులో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పేకేరు ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాళ్లపోడు గ్రామంలో డెంగీ కేసు నమోదు అయ్యింది. దీనిపై జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరావు బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ప్రస్తుతం బాధితుని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమ దోమలు అభివృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. ప్రజలందరూ ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. దీనితో దోమలను నిర్మూలించవచ్చన్నారు. అనంతరం ఆశాల సమావేశంలో సిబ్బందికి దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల పై అవగాహన కల్పించారు. అనంతరం ల్యాబ్ రికార్డ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో యూనిట్ ఆఫీసర్ భీషప్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రేఖా రాణి, ఎంపిహెచ్ఇఒ మూర్తి, ఎఎన్ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షాలు

- ఇబ్బందులు పడిన రైతులు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు
- జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాశక్తి - యంత్రాంగం

దిత్వా తుపాను వాయిగుండంగా మారింది. దీని ప్రభావంతో మంగళశారం జిల్లాలో చాలా చోట్ల వర్షాలు కురిశాయి. వర్షాలకు పలుచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. వర్షాలకు సంభవించే పంట నష్టం పై రైతులు ఆందోళన చెందుతున్నారు.

అమలాపురం: జిల్లాలో మంగళవారం ఉదయం నుండి ఎడతెరపి లేని వాన కురిసింది. అత్యధికంగా మల్కిపురం 2.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యల్ప వర్ష పాతం అమలాపురంలో 0.2 మి.మీ నమోదు అయింది. ఐ.పోలవరంలో 1.2, మామిడి కుదురులో 1.6, రాజోలులో 1, సఖినేటిపల్లిలో 2.2, అల్లవరంలో 1.6, ఉప్పలగుప్తంలో 1.8, కాట్రేనికోనలో 0.8 మి.మీ నమోదు అయింది. జిల్లాలో సరాసరి 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రామచంద్రపురం: దిత్వా తుపాను ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షాలతో పాటు చలి కూడా విపరీతంగా పెరగడంతో జనజీవనం స్తంభించింది. వర్షాలకు మెయిన్ రోడ్లన్నీ జనసంచారం లేక కర్ఫ్యూ వాతావరణం తలపించాయి. రైతులంతా రోడ్లపైనే ధాన్యాన్ని నుంచి బరకాలు కప్పుకున్నారు. వర్షాలతో ఎగుమతులు ఎక్కడికి అక్కడ నిలిచిపోగా, పలు పల్లపు చేనులోని ధాన్యం వర్షాలకు తడిసిపోయింది. వర్షాలతో పాటు చలి పెరగడంతో వృద్ధులు ఇక్కట్లకు గురయ్యారు. కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో 85 శాతం కోతలు పూర్తికాగా మరో 15 శాతం వరి చేలు పంట పొలాల్లో ఉన్నాయి. ఇక పండించిన ధాన్యం కూడా పూర్తిగా ఎగుమతి కాకపోవడంతో రైతులు వర్షాలు తగ్గిన తర్వాత ధాన్యం అమ్మకాలు కొనసాగించేందుకు ఎదురుచూస్తున్నారు.



ఎర్ర పోతవరం శివల రోడ్డు వెంబడి నిలువ చేసుకున్న ధాన్యం



అంతర్వేదిపల్లిపాలెం గ్రామం ఫిషింగ్ హార్బర్ వద్ద నిలిచిపోయిన బోట్లు

అంతర్వేది పల్లిపాలెంలో నిలిచిన చేపల వేట

సఖినేటిపల్లి : దిత్వా తుపాను నేపథ్యంలో సఖినేటిపల్లి మండలం, అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో మంగళవారం చేపలు వేట నిలిచిపోయింది. వరుసగా రెండో రోజు చేపల వేట నిలిచిపోవడంతో మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోయారు. తుపాను ప్రభావంతో సముద్రంలో అలల తాకిడి ఎక్కువగా ఉండటంతో వేటకు వెళ్లిన బోట్లు సైతం వెనుకకు తిరిగి వచ్చాయి. తరచూ తుపానులు సంభవించడంతో జీవనోపాధిని కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారిందని మత్స్యకారులు వాపోతున్నారు. అంతర్వేది పల్లిపాలెం గ్రామం మత్స్యకారులతో పాటు కృష్ణా జిల్లాకు చెందిన మత్స్యకారులు, పిఠాపురం, తుని, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన వారు అంతర్వేదిపల్లిపాలెం నుండి సముద్ర వేటకు వెళుతూ ఉంటారు. వీరంతా వేటకు వెళ్లకపోవడంతో పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ వద్ద బోట్లు నిలిచిపోయాయి.



వర్షానికి నిర్మానుష్యంగా ద్రాక్షారమం-రామచంద్రపురం మెయిన్ రోడ్డు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాను కొబ్బరి, అరటి, ఫైబర్ ముడి సరుకు ఆధారిత పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు స్థానికంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో 17 వ జిల్లా పరిశ్ర మలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమా వేశం కలెక్టర్ అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావుల పాలెం అరటి ఫైబరు, ద్రాక్షారామంలో పప్పుదినుసులు, ఉప్పలగుప్తంలో, క్వాయర్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటును వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎంఎస్ఎంఇల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు నియోజక వర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజానీకానికి సుస్థిర జీవనోపాదులు కల్పనకు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో జెసి టి.నిశాంతి, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ అరుణ ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ పద్మజ, ఎడి శివరాంప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శంకర్రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌పై నివేదిక సమర్పించాలి

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు సంబంధించి జరిగిన అభివృద్ధి పనులను గూర్చి నివేదిక రూపొందించి సమర్పించాలని మహేష్‌కుమార్ డ్రెయినేజీ విభాగ ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆయన అధ్యక్షతన డ్రెయినేజీ, జల వనరుల శాఖ ఇంజినీర్లతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ చింతల మోరీ నుంచి 23 కిలోమీటర్ల పొడవునా వైనతేయి నది వరకు ఆరుగురు సభ్యులకు కమిటీ అధ్యయన నివేది కలపై ఇంజినీర్లతో సమీక్షించారు. మేజర్ డ్రెయిన్ పూడిక తీతకు నోచుకోని కారణంగా సంభవిస్తున్న నష్టాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో శంకర్‌గుప్తం మేజర్ డ్రెయిన్ అభివృద్ధి అంశాల పట్ల రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కె.పవన్‌కళ్యాణ్ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డ్రెయినేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ ఎంవివి.కిషోర్, జలవనరుల శాఖ పర్యవేక్షకు ఇంజినీర్ గోపీనాథ్, ఇఇ వెంకటేశ్వరరావు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు కషి చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళ వారం రామచంద్రపురం లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్ లో పలు గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని మంత్రి సుభాష్‌కు అర్జీలు అందజేశారు. అర్జీలను క్షుణంగా పరిశీలించి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలోని సమస్యలన్నీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అలాగే అధికారులు దృష్టికి వచ్చిన ఏ సమస్య అయినా త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఏ సమస్య అయిన తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలనైనా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సుభాష్



నూతన జనరేటర్‌ను పరిశీలిస్తున్న ఇఒ

నూకాంబిక ఆలయంలో జనరేటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరులో శ్రీనూకాంబికా అమ్మవారి దేవస్థానంకు చెందిన ఆలయంలో 40 కెవిఎ, 3 ఫేస్ జనరేటర్ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ నిధులు సుమారు రూ.10 లక్షల తో అశోక్ లేలాండ్ కంపెనీకి సంబంధించిన నూతన డీజిల్ జనరేటర్ కొనుగోలు చేసి ఏర్పాటు చేశామన్నారు. దీంతో ఆలయంలో ఉత్సవాలు సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. అమ్మవారి జాతర దగ్గర పడుతున్న నేపథ్యంలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఆలయ ప్రాకారాలు నిర్మితమయ్యాయని, రాజగోపురాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అమ్మవారు ఉత్సవాలు సమయానికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావడానికి దాతల సహకారం అవసరమన్నారు. ఆయన వెంట ఆలయ ఛైర్మన్ వీరి అప్పారావు, గుమస్తా కృష్ణ పవన్, అటెండర్ వీరన్న తదితరులు ఉన్నారు.

కార్టూ'నిజం'



స్టడీ మెటీరియల్ అందజేత



ఆలమూరులో స్టడీ మెటీరియల్ అందజేసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ, ఆలమూరు ప్రభుత్వ జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు సీనియర్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అస్మదుల్లా ఖాన్ ఆర్థిక సౌజన్యంతో యుటిఎఫ్ వారిచే ముద్రించి, ప్రచురింపబడిన ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్‌నుఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ ఛైర్మన్ మెర్ల శ్రీనివాస మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోని మంచి ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం అస్మతుల్లా ఖాన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాస్, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షులు జి.పుత్ర కుమార్, ఉపాధ్యాయులు మాణిక్యలరావు, బి.గంగరాజు, మోహన్రావు, ఆదిత్య శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు టెన్త్ విద్యార్థులకు ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని మంగళవారం హెచ్ఎం కోలా వీరాస్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం సమ్మిట్- 1 పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా అందజేశారు. యుటిఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు నల్లి విశ్వనాథం మాట్లాడుతూ ప్రతి ఏటా టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్లతో కూడిన స్టడీ మెటీరియల్ ను, యుటిఎఫ్ నిర్వహణలో నిష్టాతులైన ఉపాధ్యాయులతో తయారు చేయబడుతోందన్నారు. మోడల్ పేపర్లను ఒక పుస్తకంగా పబ్లిష్ చేసి, రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వస్తుందని అన్నారు. లీలావతి జ్ఞాపకార్థం పుస్తకాలను ఆమె భర్త కృష్ణ విద్యార్థులకు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో సఖినేటిపల్లి మండల యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు జి.రాజబాబు, అధ్యక్షులు పి.సూర్యచంద్రరావు, ప్రధాన కార్యదర్శి గోపిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లి జెడ్‌పి పాఠశాల్లో స్టడీమెటీరియల్ పుస్తకావిష్కరణ

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అన్నారు. మండల కేంద్రంలో సివిల్ కోర్టు సమీపంలో స్థానికులకు, కక్షిదారులకు వారు మంగళవారం ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గించుట కొరకు, రోడ్ సేఫ్టీలో భాగంగా ఆలమూరు సెంటర్లో ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులను కలిగి ఉండాలని తెలియజేశారు. జొన్నాడ సెంటర్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. జాతీయరహదారిలో మద్యం తాగి ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఓవర్ లోడు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని పదిమంది వాహనదారులపై కేసులు నమోదు చేసి రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలియజేశారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐ

విద్యతోనే అభివృద్ధి

- ఇంజినీరింగ్ విద్యార్థినికి రమణారావు రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరులో పేద కుటుంబానికి చెందిన కొడమంచలి వెంకటేశ్వరరావు కుమార్తె కృపావతి బిటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. నాలుగు సంవత్సరాల బిటెక్ కోర్సు కొనసాగించేందుకు ఆమె ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న రమణారావు కృపావతి చదువు కొనసాగించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం రమణారావు రూ. 25 వేలు చెక్కును విద్యార్థిని కృపావతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగుతాయని అన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాదని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని అన్నారు. కృషావతి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఆర్థిక సాయం అందజేసి చదువును ప్రోత్సహిస్తున్న రమణారావుకు ఈ సందర్భంగా కృపావతి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్‌సీడ్ ఫౌండేషన్ సభ్యులు పినిపే జయరాజ్, నేరేడుమిల్లి శ్రీను, నక్కా సంపత్ కుమార్, పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీప్రసాద్, వినోద్, జోసెఫ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



కృపావతికి రూ.25 వేల చెక్కు అందజేస్తున్న రమణారావు

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

శాంతి భద్రతలు నెలకొల్పేందుకు చర్యలు చేయనున్నట్లు రామచంద్రపురం డిఎస్‌పి బి.రఘువీర్ తెలిపారు. కపిలేశ్వరపురం మండల పరిధి అంగర పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా మంగళ వారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ తనిఖీ చేశామన్నారు. వాటిలో ఏమైనా లోటుపాట్లు గాని, పూర్తి చేయాల్సిన పెండింగ్ పనులపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు. రికార్డులు నిర్వ హణపై, ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. నేర పరిశోధనలు ఆధునిక సాంకేతిక విధానంతో నేరస్తులను త్వరితగతిన గుర్తించ గలుగుతున్నామని అన్నారు. మండలంలో వివిధ ప్రధాన కూడళ్ళలో ఏర్పాటుచేసిన 60 నుంచి 70 సిసి కెమెరాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. గంజాయి నిర్మూలనకు పాఠశాలలు కళాశాలల్లో విద్యార్థుల తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిషేధిత మాదక ద్రవ్యాలు కలిగివున్న, వాడిన, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత 2023-24తో పోలిస్తే 2025లో క్రైమ్ రేటు తగ్గిందని, వచ్చే ఏడాది మరింత క్రైమ్ రేట్ తగ్గించేందు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.




అంగర పిఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎస్‌పి రఘువీర్

మహిళా సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్‌పి రాహుల్ మీనా అదేశాల మేరకు మహిళా సంరక్షణపై అవగాహనా కార్యక్రమం అల్లవరం జెడ్‌పిహెచ్ హైస్కూల్ నందు హెచ్ఎం నైనాలా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండల ప్రెసిడెంట్ ఇళ్ల శేషరావు అధ్యక్షతన కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసి దుర్గారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళల రక్షణ కోసం కేంద్రప్రభుత్వం మహిళా సంరక్షణ కార్యక్రమం ప్రవేశపెట్టింది. కార్యక్రమానికి అల్లవరం మండల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.సంపత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదటిగా స్కూల్ పిల్లలను ఉద్దేశించి నేటి సమాజంలో చుట్టూ మహిళలు బాలికలపై జరుగుతున్న పలు రకాల నేరాలు వాటి ద్వారా పొంచి ఉన్న ప్రమాదాలు, జాగ్రత్తలపై చట్టాలను అనుసరిస్తూ పలు చూచనలు చేశారు. మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో రాణించాలని చట్టాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యాలయంలో అందరూ స్నేహ భావంతో మెలగాలన్నారు. సమాజం మంచి కోసం ఎప్పుడు ఎలాంటి అవసరం ఏర్పడిన ఎలాంటి టైంలోనైనా పోలీస్ సహాయం పొందవచ్చన్నారు. అనంతరం స్కూల్ హెచ్ఎం నైనాలా వెంకటేశ్వరావు ఎస్ఐ సంపత్‌కుమార్‌ను సత్కరించారు. తదుపరి మండల ప్రెసిడెంట్ ఇళ్ల శేషరావు, గోడి సర్పంచ్ తోట శ్రీదేవి, నర్సింహారావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు శెట్టిబత్తుల తులసి దుర్గరావు ఎస్ఐ సంపత్ కుమార్‌ను సత్కరించి మెమెంటో బహూకరించారు. కార్యక్రమంలొ పలువురు ఉపాధ్యాయులు, ఓం గార్డ్ జేగదీష్, దేవగుప్తం సర్పంచ్, సాధనాల వెంకటరావు, కెవిపిఎస్ మండల కన్వీనర్ గెడ్డం విజయ్ కుమార్, మంగం నాగేశ్వరావు రాపాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులన ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ

హాల్ టిక్కెట్ ఇవ్వకుంటే చర్యలు

డిఇఒ సలీం బాషా

ప్రజాశక్తి - కొత్తపేట

ఫీజు బకాయి పేరుతో పదవ తరగతి విద్యార్థుల హాల్ టిక్కెట్లు నిలుపుదల చేస్తే చర్యలు తీసుకుంటామని డిఇఒ షేక్ సలీం భాషా హెచ్చరించారు. కొత్తపేట మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లతో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశము లో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించే చర్యలు ఉండకూడదన్నారు. విద్యార్థులను ఫీజుల పేరుతో ఒత్తిడి చేయడం తగదన్నారు. పదవ తరగతి పరీక్షల సమయంలో విద్యార్థుల హాల్ టికెట్ నిలిపివేయడం వంటి చర్యలు చేపట్టకూడదన్నారు. ప్రతి రోజు పాఠశాల అసెంబ్లీ కార్యక్రమంలో విద్యార్థులకు నైతిక విలువలు గూర్చి తెలియజేయాలని, ప్రతి 15 రోజులకు ఒక సారి ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించాలని సూచించారు. సమావేశంలో విద్యాశాఖ అధికారులు ఎమ్.హరి ప్రసాద్, కె. లీలావతి పాల్గొన్నారు.



సమావేశంలో మాటాడుతున్న డిఇఒ సలీంబాషా



అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

అవార్డు గ్రహీతలకు అభినందన

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అందించిన ఉత్తమ సేవలకు గాను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి రెండు అవార్డు లభించాయి. వాటిలో ఎయిడ్స్ కౌన్సిలర్ లక్ష్మీ భవానికి ఒక అవార్డు, స్టాఫ్ నర్స్ భారతి కి ఒక అవార్డు లభించాయి. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఈ అవార్డులను అందజేసినట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ప్రవీణ్ తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఉత్తమ సేవలందించడంతోపాటు వారికి అవసరమైన సూచనలు సలహాలు అందించడంలో వీరి సేవలకు గుర్తింపు లభించింది అన్నారు. అవార్డులు అందుకున్న ఇరువురిని మంగళవారం ఆయన అభినందించారు. ఆస్పత్రి సిబ్బంది అవార్డు గ్రహీతలు అభినందించారు.

టిడిపిలో పలువురిచేరిక

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపి పార్టీ లో చేరిన వారందరికీ మంత్రి సుభాష్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో సత్యవాడ గ్రామ విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ నాగబత్తుల సత్యనారాయణ, గొట్టు రవికిరణ్, బెల్లపు అప్పారావుతో పాటు మరో 10 కుటుంబాలు టిడిపిలో చేరారు. కార్య క్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమే ష్, ఉప సర్పంచ్ సలాది శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షులు బెల్లం నాని, తోట వెంకన్న, సలాది సుబ్బారాయుడు, బండారు చినబాబు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడిక తీత పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు నుంచి వెదురుమూడి వరకు ఉన్న పంటకాలువ పూడికతీత పనులు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో వేగవంతం జరుగుతున్నాయి. శ్రీనివాస్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ పంట కాలువ ద్వారా ఆలమూరు, చింతలూరు, పెద్దపళ్ళ, సందిపూడి, అంగర తదితర గ్రామాలకు సంబంధించిన వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తుందన్నారు. పెదపళ్లకు చెందిన శ్రీనివాస్ చేస్తున్న సేవల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక పెదనాన్న బాపిరాజు సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మాటలు సరిగా రాని బాలిక సోమవారం సాయంత్రం నుంచి కనిపించడంలేదన్నారు. కుటుంబ వివరాలు కూడా సరిగా చెప్పలేదని తెలిపారు. బాలిక ఆచూకీ తెలిస్తే వెంటనే సీతానగరం పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు 9440904832, 9440904829 నెంబర్లను సంప్రదించాలన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డిపిఒ

మోసం కేసులో 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - పిఠాపురం

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాకినాడ ఎస్‌డిపిఒ మనీష్‌దేవరాజ్‌పాటిల్ వివరాలను వెల్లడించారు. గత నెల 24న పిఠాపురం కోటగుమ్మం సెంటర్లో ఉద్యోగ అవకాశాలు అంటూ నెలకు రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకూ జీతం అంటూ పంపిణీ చేసిన కరపత్రం చూసి దానిలో ఉన్న ఫోన్ నెంబర్‌కు కాకినాడ రూరల్ రాయుడుపాలెంకి చెందిన నాళం గంగాభవాని సంప్రదించింది. ప్రాసెసింగ్ ఫీజులు, ల్యాప్‌టాప్ పేరుతో రూ.24 వేలు ఫోన్ పే ద్వారా పంపించమని చెప్పి ఆమెను మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారన్నారు. అలాగే కోటపల్లి సాయి, తన స్నేహితులు మరో ముగ్గురు కలిపి ఒక్కొక్కరు రూ.13 వేలు ఇచ్చినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. బ్రాంచ్ ఇండియా కార్పొరేట్ నెట్వర్క్ ప్రయివేట్ లిమిటెడ్ పేరిట రాజమహేంద్రవరంలో కార్యాలయం ఏర్పాటు చేసి, డేటా ఎంట్రీ/టెలికాలింగ్ ఉద్యోగాల పేరుతో కరపత్రాలు ముద్రించి పిఠాపురం సహా పరిసర ప్రాంతాల్లో అతికించి, నిరుద్యోగుల నుంచి రూ.13 వేలు చొప్పున వసూలు చేసినట్లు తేలిందన్నారు. ఈ విధంగా గత ఏడాది నుంచి సుమారు రూ.75 లక్షల వరకూ వసూలు చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ప్రత్యేక బృందాల ద్వారా రాజమహేంద్రవరంలో 8 మంది, సత్యసాయి జిల్లా గుండువెల్ల గ్రామానికి చెందిన మేకల మంజునాథ్, కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా మల్ల నాయకనపల్లికి చెందిన సిద్ధేశ్ శ్రీధర్, సిద్ధేశ్ సుధీ, నంద్యాల జిల్లా హనుమంతుకుంట చెందిన యశ్వంత్ కుమార్, అనంతపురం జిల్లా మార్తాడు గ్రామానికి చెందిన వడ్డి జయరాముడు, పార్వతీపురం జిల్లాకు చెందిన దేవ సౌజన్య, అనంతపురం జిల్లా మద్దిగుంటకు చెందిన నాగప్ప కావ్య, ఉప్పలగుప్తం మండలం యానాంకి చెందిన రేపు మహాలక్ష్మిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి ల్యాప్‌టాప్, అకౌంట్ బుక్స్, ఏటిఎం కార్డులు, మొబైల్స్, వివిధ నెట్వర్క్‌లకు చెందిన సిమ్ కార్డ్స్, రూ.53,000 నగదు, 20 గ్రాముల బంగారం, టీ షర్ట్స్, ట్రాన్స్ ఇండియా కంపెనీ ప్రమోషన్ ఐటమ్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులందరినీ కోర్టుకు హాజరుపరచినట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగ యువత ఇలాంటి ఆకర్షణీయ ఉద్యోగ ప్రకటనను నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం గ్రామ శివారులో సోమవారం రాత్రి నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడికి సంబంధించిన వివరాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మంగళవారం వెల్లడించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో పేకాట శిబిరంపై ఎస్ఐ శివనాగబాబు, సిబ్బంది దాడి చేశారు. దాడిలో 8మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.14,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం సున్న వారి వీధికి చెందిన వివాహిత తన కుమార్తెతో సహా అదృశ్యమైంది. ఈ మేరకు భర్త పలివెల జ్యోతిబాబు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో జ్యోతిబాబు తన ఇంటికి కిరాణా సరుకులు తీసుకుని వచ్చాడు. ఇంకా మరికొన్ని సామానులు తెమ్మని అతని భార్య సావిత్రి చెప్పింది. ఈ విషయానికి సంబంధించి భార్యపై జ్యోతిబాబు కేకలు వేసి బయటకు వెళ్ళిపోయాడు. కొంత సేపటికి ఆయన తిరిగి ఇంటికి వెళ్ళేసరికి భార్య సావిత్రి, కుమార్తె పూర్ణసాయి కృషిత ఇంటిదగ్గర కనిపించలేదు. వారి కోసం చుట్టుపక్కల గాలించి, స్నేహితులను బంధువుల ఇళ్ల వద్ద కుమార్తె గురించి అడిగారు. కుమార్తెను తీసుకుని ఆమె పుట్టింటికి వెళ్ళిపోయిందని స్థానికులు తెలిపారు. అతని అత్తగారి ఇంటికి ఫోన్ చేయగా రాలేదని చెప్పడంతో బంధువుల ఇంటి వద్ద ఆచూకీ లభించలేదు. దీంతో జ్యోతిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకటరమణ దర్యాప్తు చేస్తున్నారు.

యండవల్లి ఘటనలో
ముగ్గురు ఉపాధ్యాయులపై బదిలీ వేటు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

యండవల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల పట్ల కుల వివక్ష ఘటనకు సంబంధించి ముగ్గురు ఉపాధ్యాయులపై బదిలీ వేటు పడింది. విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను బదిలీ చేసినట్లు ఎంఇఒ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. కులవివక్షపై యండవల్లి విద్యార్థులు సోమవారం ధర్నాకు దిగారు. ఈ ఘటనపై కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఇఒను విచారణ అధికారిగా నియమించారు. ఆయన మంగళవారం పాఠశాలలో విచారణ చేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు జి.సురేష్‌భూషణ్ ను శంఖవరం, ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.సత్యనారాయణను కరప, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.ప్రసాద్‌రావును రౌతులపూడి పాఠశాలలకు బదిలీ చేసినట్లు తెలిపారు.

జొన్నాడ-మండపేట రహదారి శిథిలం

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి



జొన్నాడ మండపేట ఆర్అండ్‌బి రహదారి దుస్థితి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ, మండపేట ఆర్అండ్‌బి రహదారి సుమారు 13 కి.మీ మేర విస్తరించి ఉంది. ప్రస్తుతం దీని పరిస్థితి అధ్వానంగా తయారయింది. దీంతో కూటమి ప్రభుత్వం ఆ రోడ్డు అంతటికి మరమత్తులకు నిధులు మంజూరు చేసింది. అలాగే వీటి మరమ్మతులకు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కానీ మొదలు భాగమైన జొన్నాడ మురళీకృష్ణ రైస్ మిల్ వరకు, తోక భాగంగా పారునీటి కాలువ వంతెన నుంచి మండపేట వరకు మాత్రమే మరమ్మతులను గుత్తేదారులు చేపట్టారు. ఈమధ్యలో ఉన్న గుమ్మిలేరు పరిధి సుమారు ఐదున్నర కి.మీ మేర మరమ్మతులు చేయకుండా వదిలి వేశారు. ప్రస్తుతం 40 ఎంఎం స్టోన్స్ తో బీటీ మరమ్మతులు చేస్తున్నారు. అనంతరం వాటిపై బిటి రోడ్డుగా ఆ గోతులు పూడ్చే పనులు చేయనున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు, ప్రస్తుతం తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు మరమ్మతులు చేపట్టని ఐదున్నర కి.మీ మేర గోతులు పడి ప్రయాణికులు అవస్థ పడుతున్నారు.

గుమ్మిలేరు పరిధి రహదారికి మరమ్మతులు జరిగేనా?

జొన్నాడ మండపేట ఆర్అండ్‌బి రహదారి రెండు జిల్లా కేంద్రాలకు ప్రధాన రహదారి. ఈ రహదారికి విడివిడిగా మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డు మరమ్మతులకు రూ.2.84 కోట్లు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. మురళీకృష్ణ రైస్



గోతులతో గుమ్మిలేరు పరిధిలో రహదారి

మిల్ నుంచి మండపేట వరకు రోడ్డు విస్తరణ జరిగి 8 ఏళ్లు కావొస్తోంది. కానీ మురళీకృష్ణ రైస్ మిల్ నుంచి జొన్నాడ వరకు విస్తరణ పనులు ఆర్అండ్‌బి శాఖ ఇప్పటివరకు చేపట్టలేదు. ఇక్కడ ఎన్నో వాహన ప్రమాదాలు మురళీకృష్ణ రైస్ మిల్లు వద్ద సంభవించాయి. అయినప్పటికీ అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికార యంత్రాంగం దీనిపై స్పందించిన దాఖలాలు లేవు. ఇకనైనా స్పందించి మురళీకృష్ణ రైస్ మిల్ నుంచి పారునీటి కాలువ వంతెన వరకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పారదర్శకంగా పనులు చేపట్టాలి

జొన్నాడ, మండపేట ఆర్అండ్‌బి రహదారి మధ్య గుమ్మిలేరు పరిధి వదిలేయడం బాధాకరం. జరుగుతున్న మరమ్మతులతోనే వీటికి పారదర్శకంగా పనులు చేపట్టి పూర్తి చేయాలి. అధికారులు సత్వరమే స్పందించి రోడ్డు మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

-గుణ్ణం రాంబాబు, సర్పంచ్, గుమ్మిలేరు

ప్రతిపాదనలు పంపించాం

జొన్నాడ - మండపేట ఆర్అండ్‌బి రోడ్డులో మిగిలిన భాగమైన గుమ్మిలేరు పరిధి ఐదున్నర కిలోమీటర్ల మేర రోడ్డుకు రూ 1.80 కోట్లు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి ప్రయాణికులకు సుగమైన మార్గాన్ని అందిస్తాం.

-టి.సూర్యనారాయణ, ఆర్అండ్‌బి డిఇ,
వి.వెంకటరమణ, ఆర్అండ్‌బి ఎ ఇ

మోడరన్ హ్యుమానిటీ 51వ యూనిట్ చైర్మన్‌గా సుబ్బారెడ్డి

ప్రజాశక్తి,- రామచంద్రపురం

ఆకలి లేని సమాజం కోసం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు ప్రారంభించనున్న మోడరన్ హ్యుమానిటీ క్లబ్ ప్రారంభించనున్నారు. దీని ఆవిష్కరణలో భాగంగా మంగళవారంతోటపేటకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా క్లబ్ లోనికి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మోడరన్ హ్యుమానిటీ క్లబ్‌కి సంబందించిన ప్రతిపాదనను సుబ్బారెడ్డికి జివిరావు వివరించారు. హ్యుమానిటీ క్లబ్ 51వ యూనిట్ ఛైర్మన్‌గా ఆయనను జివి. రావు సాదరంగా ఆహ్వానించారు. తన ప్రతిపాదనకు సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమాన్ని దశలవారీగా మరింత ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్నట్లు జివి.రావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మోడరన్ శ్రేయోభిలాషుల నుంచి విశేష స్పందన వస్తుందనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరికి రావు ధన్యవాదాలు తెలియజేశారు.



సుబ్బారెడ్డి తో లయన్ జివి.రావు



సిఎం, డిప్యూటీ సిఎం, ఎంఎల్ఎ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

'తూర్పు'లో మండపేట విలీనంపై హర్షం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయడం పట్ల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అంగర పిహెచ్‌సి వద్ద నిర్వహించిన కార్యక్రమంలోఎమ్‌పిహెఇఒ జె.మల్లికార్జునుడు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, ఉద్యోగుల సౌలభ్యం కోసం ఎంఎల్ఎ వేగుళ్ళ ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీ మేరకు తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడం పట్ల కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రత్న కుమారి, డిప్యూటీ హెచ్ఇఒ బి.రామారావు, హెల్త్ సూపర్‌వైజర్ నాని బాబు, పిహెచ్‌సి సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కొత్తపేట

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమని కొత్తపేట వికెవి.డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.రమాదేవి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల లో మంగళవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రమాదేవి మాట్లాడుతూ 1984లో భోపాల్ గ్యాస్ దుర్ఘటన నుంచి నేర్చుకోవాల్సిన పాఠాల ద్వారా ఈరోజు మనకు పర్యావరణకు సంబంధించిన సమస్యలను గుర్తు చేస్తుందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలన్నారు. ముఖ్యం గా పర్యావరణ పరిరక్షణకు యువత బాధ్యత తీసుకోవాలని కోరారు. పారిశుధ్యాన్ని పాటించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, చెట్లను నాటడం, పునర్వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వటం వంటి చర్యలు చిన్నవిగా అనిపించినప్పటికీ, భవిష్యత్తులో ప్రభావం చూపుతాయన్నారు. కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా మన ఆరోగ్యానికి పర్యావరణానికి రక్షణ కల్పించగలమని విద్యార్థులకు తెలియ జేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి. శ్రీనివాసులు, డాక్టర్ కె.సత్యనారాయణ, పి.సాయి కృష్ణ, బి.విజయకుమార్, ఎం.హేమలత, పి.ప్రసన్న జ్యోతి, ఎన్‌వివి.జానకిరామ్, కె.సుకృదవల్లి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - మామిడికుదురు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం కాలుష్యాన్ని నియంత్రిద్దాం అంటూ జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థులు ప్లకార్డ్‌ల తో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. 1984 భోపాల్ గ్యాస్ దుర్ఘటన బాధితుల జ్ఞాపకార్థం, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన పెంచడానికి ఈ ర్యాలీ నిర్వహించామని కరస్పాండెంట్ డివివి.సత్య నారాయణ తెలిపారు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాగస్వామ్యం కావాలని హెచ్‌ఎం.సత్యనారాయణ పిలిపించ్చారు.

ఐసిపి చర్చిలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

ది యునైటెడ్ పాస్టర్స్‌ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్వేదిపాలెం ఐపిసి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం సామాజిక రుగ్మతగా మారిందని, వీటిపై పోరాడేందుకు ప్రజా సంఘాలు పాస్టర్లు ముందుకు రావాలని సూచించారు. రాజోలు నియోజకవర్గ ప్రజలకు ఆయన తొలి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

కె.గంగవరం సర్పంచ్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కె.గంగవరం

కె గంగవరం గ్రామ సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో మంగళవారం టిడిపిలో చేరారు. అదేవిధంగా అన్నయ్యపేట గ్రామం నుంచి బొమ్మోత్తుల అబ్బాయి నాయుడుతో పాటు మరో 25 మంది టిడిపిలో చేరారు. రామచంద్రపురం టిడిపి కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారందరినీ మంత్రి సుభాష్, టిడిపి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయ ఛైర్మన్ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలం లోని వెల్ల గ్రామంలో గల సోమేశ్వరాలయ ఛైర్మన్ అన్యం జానకిరామయ్య(60) అలియాస్ బేబీ మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఇఓ సత్యనారాయణ ఆలయ సిబ్బంది, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

ఇటీవల వివిధ ఆసుపత్రులందు వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 42 మందికి రూ.29,93,957 మంజూర అయ్యింది. ఆ చెక్కులను మంగళవారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చేతులమీదిగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సంధర్భంగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

పేరు మార్పు

పెద్దాపురం మండలం చిన బ్రహ్మదేవం గ్రామానికి చెందిన దుర్గన ఇందు కుసుమ తండ్రి దుర్గన అర్జున తెలియజేయునది ఏమనగా ఆధార్ కార్డులో నాపేరు పెమ్మన బోయిన కుసుమ అని ప్రచురించబడినది. నా అసలు పేరు దుర్గన ఇందుకుసుమని గమనించగలరు.

దుర్గన ఇందు కుసుమ
C/o. పెమ్మనబోయిన బూరయ్య, డోర్‌నెం.2-115
చినబ్రహ్మదేవం, పెద్దాపురం మండలం
కాకినాడ జిల్లా. సెల్.9676055573

సర్టిఫికెట్ పడి పోయినది

ది.24-11-2025న మట్ట మోహన్ సాయి శశాంక్ తండ్రి సత్తిబాబు ముమ్మిడివరం నగర పంచాయతికి చెందిన నేను 2024లో 10వ తరగతి పూర్తి చేసి యున్నను. ఇటీవల నా ఒరిజినల్ మార్కు లిస్టులను జీరాక్స్ నిమిత్తము ఇంటి నుండి ముమ్మిడివరం సెంటర్ కు వచ్చి చూసుకొనగా ఎస్ఎస్ సి మార్క్ లిస్ట్ ఒరిజినల్ సర్టిఫికెట్ పడిపోయినది. వెంటనే మార్కుల లిస్ట్ కోసం వేతకగా దొరకలేదు.నా మార్కుల లిస్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసినవారికి తగు పారితోషికం ఇవ్వబడును.

మట్ట మోహన్ సాయి శశాంక్
తండ్రి సత్తిబాబు,డోర్ నెంబర్. 10-10,
గొల్లల విధి, ముమ్మిడివరం నగర పంచాయతీ,
ముమ్మిడివరం మండలం,
డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం.90002 26688.

డిసిసి అధ్యక్ష పదవికి చిట్టిబాబు రాజీనామా

ప్రజాశక్తి - మామిడికుదురు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మాజీ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు మంగళవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా తన రాజీనామాను ఆమోదించాలంటూ ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలకు రాజీనామా లేఖ ను పంపించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు విలేకరులతో మాట్లాడుతూ గతంలో నాకు ఈ జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించినందుకు, ఇప్పటి వరకూ పార్టీలో నాకు సేవలందించే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు నా పట్ల మీరు అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



కొండేటి చిట్టిబాబు

మున్సిపల్ డిఇని తొలగించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపాలిటీలో పనిచేస్తున్న డిఇ శ్రీకాంత్‌ను తొలగించాలని మంగళవారం పురపాలక సంఘం కౌన్సిలర్‌లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వినతిపత్రం అంద జేశారు. డిఇ పనితీరుపై పలు ఆరోపణ చేస్తూ మున్సిపల్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తగు విచారణ చేసి చర్యలు తీసుకోవాలంటూ కోరారు దీనిపై మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించినట్లు కౌన్సిలర్లు తెలిపారు.

ఎంఇఒ కార్యాలయంలో డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - కొత్తపేట

డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా కొత్తపేట ఎంఇఒ కార్యాలయాన్ని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయంలోని సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. సిబ్బంది అందరూ కూడా ఉదయం 9 నుంచి కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న జిఎఫ్ఎల్ఎన్ సర్వే ప్రగతిని సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తనిఖీలో ఎమ్.హరి ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి - రావులపాలెం

మండల అభివృద్ధి అధికారి సిహెచ్.సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా లక్ష్మీపోలవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం షెడ్డును పరిశీలించారు. షెడ్ చుట్టూ, కాలవ గట్టుపై ఉన్న చెత్తను తొలగించాలని కార్యదర్శి సబితకు ఆదేశాలిచ్చారు. అనంతరం 30నెంబర్ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసి కేంద్రం పనితీరు, రిజిస్టర్లు మెయింటెనేన్స్ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మంద కృష్ణకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - రావులపాలెం

ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణకు జిల్లా పర్యటన సందర్భంగా రావులపాలెం మంగళవారం భారీ కాన్వాయ్‌తో ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ ఆధ్వర్యంలో కోనసీమ ముఖ ద్వారం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్‌తో కొత్తపేట చేరుకొని ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు, ప్రస్తుత ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బాలికోన్నత పాఠశాలలో అకరడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ స్కూల్ అసిస్టెంట్, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌గా 5 నెలల కాలనికి పని చేయుటకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తును డిసెంబర్ 5 లోపు ఎంఇఒ కార్యాలయం, ముమ్మిడివరం నందు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖధికారులను సంప్రదించాలని సూచించారు.

ఎంఎల్‌సి తోటపై వ్యక్తిగత దూషణలు తగవు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులుపై వ్యక్తిగత దూషణలు తగవని వైసిపి నేతలు అన్నారు. అంగర పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్‌పిటిసి పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిపి సాకా శ్రీనివాస తదితరులు మాట్లాడారు. ఎంఎల్‌సి తోట మాటలను ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ల లీలా కృష్ణలు వక్రీకరించి వ్యక్తిగత దూషణలకు పాల్పడడం సరికాదన్నారు. మండపేట నియోజకవర్గంలో గత వైసిపి పాలనలో మెజార్టీ గ్రామపంచాయతీలు, 3 ఎంపిపి స్థానాలు, మండపేట మున్సిపాలిటీ ఏకగ్రీవ తీర్మానాలు చేయడం వల్లే ఈ విలీన ప్రక్రియ సాధ్యమైందన్నారు. సమావేశంలో పిప్పర సంపతరావు, సలాది వీరబాబు, ఎంపిటిసి మేడిశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం.17867/1997-జి1 **తేది.01-12-2025**

ప్రకటన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల దానవాయిపేట లే-అవుటు నందలి స్థలములకు చేర్చి ఉన్న కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు స్థల యజమానులు ఆక్రమించుకొని నిర్మాణములు చేసుకొనియున్నారు. సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలముల యొక్క ఆవశ్యకత ప్రస్తుతము లేనందున సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు అనగా కన్సర్వేన్సీ లేన్ స్థలముల ఆక్రమణదారులకు విక్రయించుటకు తీర్మానము నెం. 03/471/2011, తేది.30-04-2011 నందు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించినారు. సదరు విషయమై ప్రభుత్వము వారు జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 488, తేది.11-12-2013 నందు దానవాయిపేట నందలి కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారిని అనుమతించియున్నారు. శ్రీయుత జిల్లా కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు చదరపు గజము ఒక్కింటికీ నిర్ణయించు ధరకు లోబడి దానవాయిపేట కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు గాను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించియున్నారు.

ఇందుపై సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలములను గుర్తించి సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొనవలసినదిగా ఈ కార్యాలయము వారిచే నోటీసులు జారీ చేయడమైనది.

ఇందుపై ఈ క్రింది తెలిపిన మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులు కొనుగోలు చేయుటకు ఆసక్తి వ్యక్తపరచి దరఖాస్తులు దాఖలు చేసియున్నారు.

క్రమ సంఖ్య	సర్వే నెంబర్ మరియు డోర్ నెంబర్	దరఖాస్తుదారు పేరు (కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చియున్న స్థల యజమాని)	కన్సర్వేన్సీ లేన్ స్థల విస్తీర్ణము	కన్సర్వేన్సీ లేన్ స్థలమునకు సరిహద్దులు
1	తలుపు నెంబరు 46-17-18/1, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం. 343, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ అద్దంకి ఉదయ భాస్కర్ S/o. శ్రీరామమూర్తి	12.34 చ॥గ॥లు (6'-6" X 17'-1") 10.318 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము, టి.ఎస్. నెం. 343/పి - 17'-1" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము, టి.ఎస్.నెం. 340/పి - 17'-1" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము, టి.ఎస్. నెం. 340/పి - 6'-6" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 340/పి - 6'-6"
2	తలుపు నెంబరు 46-07-35, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం. 457 & 463 Part, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ కంచర్ల యోగ నరసింహ ప్రసాద్ S/o. కంచర్ల రామారావు	43.33 చ॥గ॥లు (6'-06" X 60'-00") 36.23 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.457/పి - 60'-00" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 457/పి - 60'-00" ఉత్తరము: రోడ్డు - 6'-6" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 457/పి - 6'-6"
3	తలుపు నెంబరు 46-17-41, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం. 451 Part & 448 Part, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ చిక్కం మధుసూదనరావు S/o. చిక్కం సత్యనారాయణరావు (లేటు)	10 చ॥గ॥లు (6'-00" X 15'-00") 8.36 చ॥మీ॥	తూర్పు: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 448/పి - 15'-00" పడమర: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 451/పి - 15'-00" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము - టి.ఎస్. నెం. 448/పి - 6'-00" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 448/పి - 6'-00"
4	తలుపు నెంబరు 46-16-17/1, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 4, టి.ఎస్. నెం. 300 Part & 262 Part, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి అపర్ణ జోగ W/o. ఉమేష్ జోగ	25.27 చ॥గ॥లు (6'-06" X 35'-00") 21.13 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 300/పి - 35'-00" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 362/పి - 35'-00" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము - టి.ఎస్. నెం. 262/పి - 6'-06" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 262/పి - 6'-06"
5	తలుపు నెంబరు 46-16-17, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం. 300 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి గెద్దాడ శారదా దేవి, భర్త: నేతాజీ నగేష్	11.04 చ॥గ॥లు (5'-01" X 4'-09/2), 9.23 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 300/పి - 20'-01" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 262/పి - 20'-00" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము - టి.ఎస్. నెం. 262/పి - 4'-09" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 262/పి - 5'-01"
6	తలుపు నెంబరు 46-23-11, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం. 503, 504 Part & 510 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి సుంకర ఫణి రాజకుమారి, భర్త: సాయి మాణిక్యాలరావు & అదర్స్	65 చ॥గ॥లు (90'-0" X 6'-6"), 54.35 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 503 & 504/పి - 90'-0" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 510/పి - 90'-00" ఉత్తరము: రోడ్డు - 6'-6" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 510/పి - 6'-6"
7	తలుపు నెంబరు 46-23-4, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 8, టి.ఎస్. నెం. 548 Part & 542 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ కందుల విశ్వానంద కుమార్, S/o. కందుల సుబ్బారావు (లేటు)	43.29 చ॥గ॥లు (6'-6" X 60'-0"), 36.20 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 548/పి - 60'-0" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 542/పి - 60'-00" ఉత్తరము: రోడ్డు - 6'-6" దక్షిణము: పొరుగువారి స్థలము టి.ఎస్.నెం. 547/పి - 6'-6"
8	తలుపు నెంబరు 46-18-18, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం. 332 Part & 333 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి వేములపల్లి కృష్ణకుమారి, W/o. బాబ్జి రామకృష్ణ	18.17 చ॥గ॥లు (39'-03" + 39'-04"/2 x 03'-00" + 05'-4"/2) 15.19 చ॥మీ॥	తూర్పు: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 361/పి - 39'-04" పడమర: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 330/పి - 39'-03" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్. నెం. 361/పి - 5'-4" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 361/పి - 3'-00"

కావున పైన పొందుపరచిన కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులకు విక్రయించుటకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఏడు (7) రోజుల్లోపు లిఖితపూర్వకంగా నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కోరడమైనది.

సం/- **కమిషనరు**
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం